


100 రోజులు ప్రగతి పరుగులు

జిల్లాకు కొత్త సంస్థల మంజూరు

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం

ఎప్పటికప్పుడు నిధుల కేటాయింపు

బాధ్యతగా అధికార యంత్రాంగం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలో ప్రగతి పరుగులు తీస్తోంది. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. అధికార యంత్రాంగం కూడా బాధ్యతగా పనిచేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటితో వంద రోజులు పూర్తయింది. పెన్షన్ల పంపిణీ, గ్రామ పంచాయతీలకు నిధులు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ఉద్యోగులకు సరైన సమయంలో జీతాలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటివాటిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసినా.. మన జిల్లాకు ప్రత్యేకంగా లబ్ధి కల్గినవీ చాలా ఉన్నాయి. ప్రధానంగా.. రెండు కేంద్రీయ విద్యాలయాలు, ఓ కృషి విజ్ఞాన కేంద్రం, కుప్పంలో మిగులు భూముల సమస్య పరిష్కారం, కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటులో కదలిక, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు వంటివి ఉన్నాయి. ఇలాంటి వాటిల్లో టాప్ 10పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. - ఆంధ్రజ్యోతి, చిత్తూరు

1 రెండు కేంద్రీయ విద్యాలయాలు

టీడీపీ అధికారంలోకి వస్తానే జిల్లాకు కలిగిన అతి పెద్ద ప్రయోజనం అంటే రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు కావడం. చిత్తూరులో గతం లోనే మంజూరైనా అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు అనువైన స్థలాన్ని చూపించక పోవడంతో అది వెనక్కి వెళ్లిపోయింది. టీడీపీ అధికారంలోకి రాగానే చిత్తూరుతోపాటు కుప్పంలోనూ కేంద్రీయ విద్యాలయాల స్థాపనకు స్థలాన్ని చూపించి మంజూరు చేయించుకుంది. చిత్తూరు రూరల్ మండలం మంగసముద్రంలో 8 ఎకరాలు, కుప్పం మున్సిపాలిటీ పరిధి బైరిగానిపల్లెలో 8.74 ఎకరాల్ని విద్యాలయాలకు కేటాయించారు. ఆగస్టులో కేంద్రీయ విద్యాలయ బృందం ఈ స్థలాల్ని విజిట్ చేసింది. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి ఈ రెండు ప్రారంభమయ్యే అవకాశముంది. చిత్తూరులో మాత్రం ఇరువారం వద్దనున్న సెరికల్చర్ శాఖ వారి సిల్క్ బిల్డింగులో తాత్కాలికంగా ప్రారంభిస్తారు.



కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు కోసం చిత్తూరులో భూమిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

2 కుప్పం కార్గో ఎయిర్‌పోర్టులో కదలిక



శాంతిపురం మండలం అమ్మవారిపేట వద్ద కార్గో విమానాశ్రయానికి కేటాయించిన భూమి

కుప్పంలో కూరగాయలు, పండ్లు, పూలు అధికంగా సాగవుతున్నాయి. వీటిని సకాలంలో ఎగుమతి చేసుకుని రైతులు బాగుపడాలనే ఉద్దేశంతో 2014-19 మధ్యకాలంలో సీఎం చంద్రబాబు కుప్పంలో కార్గో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలనుకున్నారు. రామకుప్పం మండలంలోని కిల్లాకిపోడు, మన్నేంద్రం, కడిసినకుప్పం గ్రామాలు.. శాంతిపురం మండలంలోని అమ్మవారిపేట, సొన్నేగానిపల్లె గ్రామాల్లో అప్పట్లోనే 495.15 ఎకరాల్ని సేకరించారు. రూ.16.34 కోట్ల పరిహారాన్ని కూడా పంపిణీ చేసేశారు. వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన రూ.13.46 కోట్ల పరిహారం కోసం ప్రతిపాదనలు పంపించారు. సీఎం చంద్రబాబు కూడా ఈ విషయంగా ఆసక్తిగా ఉండడంతో త్వరలోనే పరిహారం మంజూరయ్యే అవకాశముంది.

3 బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం



బంగారుపాళ్యంలో ఏర్పాటుచేసిన డయాలసిస్ మిషనరీ

మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర వంద కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇప్పటికే రూ.50 లక్షలు విలువ చేసే ఐదు రకాల పరికరాలను ఏర్పాటు చేశారు. గురువారం మంత్రి ఈ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

4 నగరి ఆస్పత్రికి అంబులెన్సు

కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాకు కొత్తగా వచ్చినప్పుడు నగరిలో పర్యటించారు. అక్కడి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అంబులెన్సు లేదని తెలుసుకుని తుడా అధికారులను సంప్రదించి అంబులెన్సు ఏర్పాటు కోసం రూ.27 లక్షలు తీసుకున్నారు. దాంతోపాటు 'చిత్తూరు కలెక్టర్ ఖాతాలోని నిధులు' రూ.8లక్షలు కేటాయించి మొత్తం రూ.35 లక్షలతో నూతన అంబులెన్సును మంజూరు చేయించారు. మరో పది రోజుల్లో అంబులెన్సు అందుబాటులోకి వస్తుంది. చిత్తూరు ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో దాన్ని చిత్తూరుకు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

5 5,700 మందికి కంటి సమస్యలు దూరం

కుప్పం నియోజకవర్గంలో మెగా క్యాంపు నిర్వహించి 50 ఏళ్లపైబడి కంటి సమస్యలున్న సుమారు 5,700 మందిని గుర్తించారు. వారిలో 4వేల మందికి అద్దాలు పంపిణీ చేసి, మరో 700 మందికి సర్జరీలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఒకేసారి ఇంతమంది సమస్యను పరిష్కరించడం తొలిసారి.

6 రూ.93 కోట్లతో గ్రామ సభల్లో గుర్తించిన పనులు

చరిత్రలో నిలిచిపోయేలా ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి గ్రామ సభల్ని నిర్వహించిన విషయం తెలిసిందే. దీన్ని తాజాగా వరల్డ్ రికార్డ్స్ యూనియన్ గుర్తించి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ధ్రువపత్రాన్ని కూడా అందించింది. మన జిల్లాలో కూడా 700 పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో 1,407 పనుల్ని రూ.93 కోట్లతో గుర్తించారు. అవన్నీ తాజాగా మంజూరయ్యాయి. రూ.63 కోట్లతో 139 కిలోమీటర్ల సీసీ రోడ్లను, రూ.30 కోట్లను చెక్‌డ్యామ్‌లు, క్యాటిల్ షెడ్స్ వంటివాటికి మంజూరు చేశారు.

7 మిగులు భూముల సమస్యకు పరిష్కారం

కుప్పంలోని రైతులను 'మిగులు భూములు' పీడిస్తోంది. వైసీపీ హయాంలో ఓ తహసీల్దార్ రైతుల భూముల ఖాతా నెంబరుకు బదులుగా మిగులు భూమి అంటూ రికార్డుల్లో నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కలెక్టర్ సుమిత్‌కుమార్ దీన్ని సవాలుగా తీసుకుని పరిష్కరించారు. 31 గ్రామాల్లోని 2,318 రైతులకు చెందిన 4,002 ఎకరాల మిగులు భూములుగా ఉన్నట్లు గుర్తించారు. 2,065 రైతుల 2,569 ఎకరాల్ని ఆరు విడతల్లో మిగులు భూములుగా రికార్డుల్లో నుంచి తొలగించారు. రైతులు చనిపోవడం, రికార్డులు సక్రమంగా లేకపోవడంతో మిగిలినవి ప్రాసెస్‌లో ఉన్నాయి.

8 ఉద్యాన పంటలకు రూ.19.64 కోట్లు

టీడీపీ ప్రభుత్వం ఉద్యాన పంటల్ని ప్రోత్సహించి రైతులకు మేలు కలిగేలా చేస్తుంది.2014-19 మధ్యకాలంలో జిల్లా ఉద్యాన పంటల సాగులో ప్రథమ స్థానంలో ఉండేది. తాజాగా ఈ పంటల ప్రోత్సాహకానికి జిల్లాకు రూ.19.64కోట్లకు మంజూరు చేసింది. అందులో సింహభాగం రూ.10.54 కోట్లకు కుప్పం నియోజకవర్గానికి కేటాయించింది.మిషన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ హార్టికల్చర్ కింద రైతులకు 40-55%రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

9 కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు



శాంతిపురం మండలం తంబిగానిపల్లె వద్ద కృషి విజ్ఞాన కేంద్రానికి కేటాయించిన భూమి

ఇప్పటికే కుప్పంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో రీసెర్చ్ సెంటర్ ఉంది. తాజాగా శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ 50 ఎకరాల భూమిని సేకరించేందుకు సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపించారు. ఇక్కడ రైతులకు ఉపయోగపడే సాయిల్ టెస్టింగ్, రీసెర్చ్ వంటివి చేస్తారు.

10 మామిడి రైతులకు మద్దతు ధర

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మామిడి రైతులు మద్దతు ధర లేక ఇబ్బందులు పడేవారు. అప్పటి కలెక్టర్లు ధర నిర్ణయించినా పల్ప్ ఇండస్ట్రీస్ యజమానులు సిండికేట్‌గా మారి ఆ ధరను అమలు చేసేవారు కాదు. యజమానులకు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండ ఉండేదని కూడా ప్రచారంలో ఉండేది. ఈ క్రమంలో ఈసారి సీజన్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని రైతులతో, పల్ప్ ఇండస్ట్రీస్ యజమానులతో వరుసగా సమావేశాలు నిర్వహించారు. మద్దతు ధర విషయంలో గట్టి సూచనలు చేశారు. దీంతో జిల్లాలో టన్ను ధర రూ.24 వేలకు తగ్గకుండా పలికింది. సుమారు 55వేల మంది జిల్లా రైతులకు మేలు కలిగింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పాలిటెక్నిక్ విద్యార్థుల మృతి

● అపస్మారక స్థితిలో మరొకరు



ముందు భాగం ధ్వంసమైన ద్విచక్రవాహనం- చెట్టును ఢీకొన్న ట్రాక్టర్



ఆనంద్ బాబు - మంజునాథ్ రెడ్డి మృతదేహాలు



గాయపడ్డ పునీత్ కుమార్

కుప్పం, సెప్టెంబరు 18: కుప్పం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుప్పం జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇద్దరు మృతి చెందారు. అధ్యాపకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన పునీత్‌కుమార్(18), ఆనంద్‌బాబు(15), రాజంపేటకు చెందిన చెందిన మంజునాథ్‌రెడ్డి (18)లు కుప్పంలో గది తీసుకుని ఉంటూ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్స్ ఈసీఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. వీరిలో ఆనంద్‌బాబుకు చెవినొప్పి ఉండడంతో వైద్యంకోసం ద్విచక్ర వాహనంపై పీఈఎస్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యం తీసుకుని గదికి తిరుగు ప్రయాణమయ్యారు. కుప్పం పట్టణ సమీపం చెరువు బైపాస్ క్రాస్ వద్దకు వచ్చేసరికి ఓ ట్రాక్టరు రోడ్డు దాటడం కనిపించింది. అయితే అమిత వేగంతో వస్తున్న యువకులు.. ఈ ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రోడ్డు మీద పడిన మంజునాథ్ రెడ్డి, ఆనంద్‌బాబు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. పునీత్ కుమార్ అపస్మారక స్థితిలో పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుప్పం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ఉచితం సరే.. ఉండాలి కదా..?

ఖాళీగా స్టాక్ పాయింట్లు

నేటినుంచి నూతన పాలసీ

చిత్తూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గురువారం నుంచి నూతన ఇసుక పాలసీని అమలు చేయనుంది. ఉచితంగా ఇసుకను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఆయా సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అర్హులకు ఉచితంగా ఇసుకను అందించేలా నేటినుంచి నూతన విధానాన్ని తెస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు జిల్లాలో ఇసుక నిల్వలు లేవు. దీంతో అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో చిత్తూరు రూరల్‌లోని దిగువమాసపల్లె, పాలారు, గంగవరం మండలంలోని బైరెడ్డిపల్లె క్రాస్ వద్ద మూడు స్టాక్ పాయింట్లను ప్రారంభించారు. లోడింగ్ చార్జీలు మాత్రమే తీసుకుని అవసరమైన వారికి ఇసుకను అందించారు. ఇప్పుడు ఆయా స్టాక్ పాయింట్లలో ఇసుక ఖాళీ అయిపోయింది. దిగువమాసపల్లె స్టాక్ పాయింట్‌లో మాత్రం 80వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఇదీ వారం పది రోజుల్లో పూర్తయిపోతుంది.

భారీ వర్షాలు వస్తేనే..

వాస్తవానికి ఇసుక రీచ్‌ను గుర్తించాలంటే.. గనుల శాఖ నిబంధన మేరకు ఆ నదిలో కనీసం మూడు మీటర్ల లోతులో ఇసుక ఉండాలి. ఇలా జిల్లాలో ఎక్కడా లేదు. దీంతో ఆ శాఖ అధికారులు కూడా రీచుల్ని గుర్తించలేకపోతున్నారు. ఇక భారీ వర్షాలు వచ్చినప్పుడు ఆయా నదుల్లో ఇసుక చేరినప్పుడే రీచుల గుర్తింపు సాధ్యమవుతుంది. సమస్యకు పరిష్కారం దక్కుతుంది. లేదంటే తిరుపతి జిల్లా గూడూరు వద్ద డీసిల్టేషన్ ద్వారా తయారు చేస్తున్న ఇసుకను జిల్లాకు తెచ్చుకోవాల్సి వస్తుంది.



గంగవరం మండలం బైరెడ్డిపల్లె క్రాస్ వద్ద ఇసుక అయిపోవడంతో ఖాళీగా ఉన్న స్టాక్ పాయింట్

గురువారంనుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి వస్తున్న నేపథ్యంలో ఇసుక ఎక్కడుందో చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీంతో ఏం చేయాలో తెలియక స్థానికంగా ఉండే వాగులు, వంకల్లో ఉండే ఇసుకను మిషనరీతో కాకుండా మనుషులతో లోడింగ్ చేసుకుని ఉచితంగా తీసుకెళ్లవచ్చని కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. మనుషులతో లోడింగ్ అనేది ఎంతవరకు సాధ్యమనేది కూడా ఆలోచించాల్సి ఉంది. ఒకవేళ మనుషులతో లోడింగ్ చేసినా.. దాన్ని అక్రమార్కులు అవకాశంగా మలుచుకోలేరని చెప్పలేం.

నేడు, రేపు మంత్రి లోకేష్ పర్యటన

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ గురు, శుక్రవారాల్లో జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన తిరుపతి మీదుగా బయల్దేరి బంగారుపాళ్యం మండల కేంద్రానికి రాత్రి 8.30 గంటలకు చేరుకుని అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కిడ్నీ డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అక్కడ జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు బంగారుపాళ్యం నుంచి రోడ్డుమార్గాన తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18: జిల్లా పరిషత్ (జడ్పీ) స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు సీఈవో గ్లోరియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సంబంధిత అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.



సింహరాజుపురంలో రైతుల నిరసన

ట్రాన్స్‌ఫార్మర్ స్తంభమెక్కి..!

పాలసముద్రం, సెప్టెంబరు 18: కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలంటూ పాలసముద్రం మండలంలోని సింహరాజుపురంలో రైతులు వినూత్న రీతిలో బుధవారం నిరసన తెలిపారు.అధికారులు పట్టించుకోవడం లేదంటూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన స్తంభాన్ని ఓ రైతు ఎక్కి కూర్చొన్నాడు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సింహరాజుపురంలో జగన్నాథరెడ్డి అనే రైతు పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రెండు నెలలు దాటినా అధికారులు కొత్తది ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో జగన్నాథరెడ్డి నాటిన వరి నారు ఎండి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను నలుగురు రైతులు వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ వరదరాజులు మాట్లాడుతూ.. రెండ్రోజుల్లోగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

ఒకేరోజు 35మంది రైతుల పొలాల్లో మోటర్ వైర్ల చోరీ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 18: మండలంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో ఒకేరోజు రాత్రి 35మంది రైతులకు చెందిన పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటర్లలోని వైర్లు చోరీకి గురయ్యాయని గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్న తెలిపారు. గంగాధరనెల్లూరు పంచాయతీ పరిధిలోని నల్లరాళ్లపల్లె, ముక్కళత్తూరు గ్రామాల్లోని రైతులకు సంబంధించి వ్యవసాయ బావులు, బోర్ల వద్ద గల విద్యుత్ మోటర్లకు చెందిన వైర్లను మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకుని ఎత్తుకెళ్లిపోయారు. దీనిపై రైతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖలో బదిలీలు

● డీఐజీ కొనసాగింపు, డీఆర్ బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో భారీ ఎత్తున బదిలీలు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా పని చేస్తున్న పి.గిరిబాబును ఇక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావును ఏలూరుకు బదిలీచేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. అన్నమయ్య జిల్లా రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న ఎం.మునిశంకరయ్యను చిత్తూరు జిల్లా (మార్కెట్ వ్యాల్యూ అండ్ ఆడిట్) రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ మార్కెట్ వ్యాల్యూ, ఆడిట్ డీఆర్‌గా పనిచేస్తున్న ఉషారాణి మార్చినెలలో పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది.

నేడు కుప్పంలో పీజీఆర్ఎస్ రద్దు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దుచేసి, వచ్చే వారానికి మార్పుచేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక వెబ్‌సైట్‌ను గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభిస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

66 మంది డీటీల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సూచనల మేరకు మండల కేంద్రాల్లోని డిప్యూటీ తహసీల్దార్లు (డీటీలు) 25 మందిని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ బదిలీ చేశారు. అలాగే రీ సర్వే విధులు నిర్వహిస్తున్న డీటీలు 26 మంది, ఎన్నికల విభాగంలో పనిచేస్తున్నవారు నలుగురు, నాలుగు ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న డీటీల్లో ఐదుగురు, డీఎస్వో ఆఫీసులో పనిచేస్తున్న డీటీలు ఆరుగురిని కూడా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో 17 మంది వీఆర్వోల బదిలీలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 17మంది వీఆర్వోలను అంతర్ జిల్లాలకు బదిలీ చేస్తూ నోడల్ ఆఫీసర్ అయిన కలెక్టర్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లాలోని నగరి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న టి.ప్రదీప్, పులిచెర్ల నుంచి కె.మునిరత్నం, వి.ప్రశాంత్‌కుమార్, బి.మునిరాజ, సోమల నుంచి డి.శ్రీనివాసులు, ఐరాల నుంచి టి.జయబాల, కె.నాగరత్నం, రామకుప్పం నుంచి ఎం.శివనారాయణ, సదుంలో పనిచేస్తున్న సి.ఆంజనేయులును తిరుపతి జిల్లాకు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తిరుపతి జిల్లాలోని ఎర్రావారిపాళ్యం నుంచి ఎస్.మహబూబ్ బాషా, పుత్తూరు నుంచి డి.సుబ్రహ్మణ్యం, కె.విజయ్‌కుమార్, పాకాల మండలం నుంచి వి.వెంకటరాజేష్, జి.సుబ్రహ్మణ్యం, జి.హరికృష్ణ, తిరుపతి అర్బన్ నుంచి జి.కమల, వై.సుబ్రహ్మణ్యంలను చిత్తూరు జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, సెప్టెంబరు 18: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరం నాల్గవ విడత ప్రవేశాలకు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో మాత్రమే చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 29న, ప్రైవేటు వారికి 30వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 77999 33370 నెంబరును సంప్రదించాలని కోరారు.

సింగిల్‌విండోల్లో ఎరువుల అమ్మకాలు: జేసీ



సమావేశంలో ప్రసంగిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: సహకార సంఘాల బలోపేతం కోసం ప్రస్తుత ఏడాది నుంచి 14 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (సింగిల్‌విండోలు) ఎరువుల అమ్మకాలకు సహకరించాలని వ్యవసాయశాఖ అధికారులను బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ విద్యాధరి కోరారు. బుధవారం డీసీసీబీ సర్వసభ్య సమావేశం జేసీ అధ్యక్షతన జరిగింది. బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్ వార్షిక నివేదికను వివరిస్తూ గతేడాది బ్యాంకు రూ.9.66 కోట్లు నికర లాభం ఆర్జించిందని తెలిపారు. రూ.932.14 కోట్లు డిపాజిట్ల రూపేణా వసూలు చేయగా, రైతాంగానికి రూ.2002.25 కోట్లు వివిధ రకాల రుణాలను అందించామని తెలిపారు. ప్రస్తుత ఏడాది బ్యాంకు వ్యాపారం రూ.3600 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకోగా, రుణ పంపిణీకి రూ.2500 కోట్లు, డిపాజిట్ల సేకరణ రూ.1100 కోట్లు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వ సూచనల మేరకు ఉమ్మడి జిల్లాలో కంప్యూటరీకరణను నిర్దిష్టమైన ప్రణాళికతో పూర్తి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో డీసీవో నాగవర్ధన, తిరుపతి డీసీవో లక్ష్మి, డీఎల్‌సీవో వనజ, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, పశు సంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్‌లతో పాటు డీసీసీబీ అధికారులు, సింగిల్‌విండోల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను గృహ వినియోగదారులందరూ వినియోగించుకోవాని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమంపై కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ రాయితీ ద్వారా గృహ వినియోగదారులు సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పథకానికి బ్యాంకులు ఏడు శాతం తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తాయని తెలిపారు. ఈ ఏడాది 50వేల గృహాలకు రాయితీ ద్వారా సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ గయాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 18,401 మంది వినియోగదారులు ఈ పథకం కోసం పేర్లు నమోదు చేసుకోగా, 1078 దరఖాస్తులను ఆమోదించినట్లు చెప్పారు. జడ్పీ సీఈవో గ్లోరియా, డీఆర్డీఏ పీడీ తులసి, డీపీవో లక్ష్మి, ఎల్డీఎం హరీష్, విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు, నామినేటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమలలో మాదిరి గరుడసేవ



తిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అక్టోబరు 4 నుంచి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం మాదిరి గరుడ సేవ నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున మలయప్పస్వామికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఏటా బ్రహ్మోత్సవాలకు ముందు పౌర్ణమి రోజున మాదిరి గరుడ సేవ నిర్వహించడం పరిపాటి. తద్వారా బ్రహ్మోత్సవ ఏర్పాట్లను అధికారులు సమీక్షించుకుంటారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన గరుడసేవలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ కలిసి నాలుగు మాడవీధుల్లో భద్రత, తాగునీరు పంపిణీ, అన్నప్రసాదాల వితరణ, శ్రీవారిసేవకుల సేవలు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, ఇతర ఇంజినీరింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. గరుడ వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భజనబృందాలు ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు నడుమ పౌర్ణమి గరుడసేవ కన్నులపండువ గా జరిగింది. గరుడ వాహనసేవలో భక్తులు భారీగా పాల్గొని కర్పూర హారతులు పడుతూ గోవిందనామస్మరణలతో స్వామిని దర్శించుకున్నారు.



గరుడ వాహనంపై మలయప్పస్వామిని దర్శించుకోవడానికి తరలి వచ్చిన భక్తజనం

రావణబ్రహ్మపై విఘ్ననాథుడు





ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఉభయదారులు - రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తున్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా స్వామి బుధవారం రావణబ్రహ్మ వాహనంపై ఊరేగారు. ఈ కార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కుర్చపల్లె, సిద్ధంపల్లె, ముద్దురామాపురం గ్రామాలకు చెందినవారు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం నిర్వహించాక, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో ఆలయ అలంకార మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి రావణబ్రహ్మ వాహనంపై అధిష్ఠింపజేసి, కాణిపాక పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి ఉభయదారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు

కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా గురువారం వరసిద్ధుడికి యాళి వాహన సేవ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అగరంపల్లెకు చెందిన ఎ.నరసింహారెడ్డి వారి కుమారులు, చినకాంపల్లెకు చెందిన పి.సుబ్బారెడ్డి వారి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.







ఆస్థాన మండపంలో నృత్యాలు చేస్తున్న కళాకారులు - గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

చల్లా బాబుకు భద్రత తొలగింపుపై టీడీపీ శ్రేణుల్లో ఆందోళన



పుంగనూరు, సెప్టెంబరు 18: పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు)కు ఇటీవల పోలీసు భద్రత తొలగించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటి నుంచి గన్‌మ్యాన్ ఉండగా కొద్దిరోజుల క్రితం భద్రతను ప్రభుత్వం ఉపసంహరించింది. దీనిపై టీడీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. గత శాసనసభ ఎన్నికల్లో చంద్రబాబును కుప్పంలో గెలవనియ్యమని అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. దీనికి నాటి ఎస్పీ రిశాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సహకరించిన విషయమూ విదితమే. అలాగే పెద్దిరెడ్డికి పుంగనూరులో అడ్డులేకుండా చేసుకోవడానికి ప్రతిపక్షాలను కట్టడి చేస్తూ టీడీపీ శ్రేణులు 1000 మందిపై పోలీసుల ద్వారా కేసులు పెట్టి ఎన్నికలకు దూరం చేయాలని వ్యూహం రచించారు. రెండేళ్ల క్రితం సదుం మండలం బూరగమందకు చెందిన టీడీపీ నాయకుడు రాజారెడ్డిని వైసీపీ మూకలు కిడ్నాప్ చేసి దారుణంగా కొట్టారు. ఈ సమయంలో టీడీపీ శ్రేణులకు భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో చల్లా బాబు.. పులిచెర్ల మండలం కల్లూరులో భారీ ఎత్తున నిరసనగా ధర్నా చేశారు. దీనికి అనుమతి లేదంటూ టీడీపీ నేతలపై పోలీసులు లాఠీలు ఝుళిపించి భయభ్రాంతులకు గురిచేశారు. ఆ సమయంలో వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడగా ఉద్రిక్తత నెలకొంది. అయినా చల్లా బాబుతోపాటు పలువురిపై కేసులు పెట్టారు. సోమల మండలం పెద్దఉప్పరపల్లె, నంజంపేటలో టీడీపీ ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమానికి వెళుతుండగా సోమలలో చల్లా బాబు కారుపై వైసీపీ మూకలు రాళ్లు వేసి అద్దాలు ధ్వంసం చేశారు. అప్పుడూ చల్లా బాబుపైనే కేసులు పెట్టారు. గత ఏడాది ఆగస్టు 4న చిత్తూరుకు చంద్రబాబు ప్రతిపక్ష హోదాలో వచ్చినప్పుడూ పెద్ద గొడవే జరిగింది. ఈ సందర్భంగా చల్లా బాబుతోకలిపి 502 మంది టీడీపీ శ్రేణులపై హత్యాయత్నంతోపాటు కఠిన తరమైన సెక్షన్లతో ఏడు కేసులు పెట్టి కడప, చిత్తూరు, మదనపల్లె జైళ్లలో మూడునెలలు రిమాండులో ఉంచారు. చల్లా బాబుపై 17 పోలీసు కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చెందినా పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీగా మిథున్‌రెడ్డి గెలిచారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పుంగనూరులో చల్లా బాబు హవా సాగుతోంది. ఈ క్రమంలో పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలను పుంగనూరులో కూటమి నేతలు, బాధితులు రెండు మార్లు అడుగుపెట్టనియ్యలేదు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యేలుగా తమకు రక్షణ లేదని కోర్టును ఆశ్రయించారు. ఇటీవల పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వద్ద మిథున్‌ను అడ్డుకోవడం, కూటమి, వైసీపీలు పరస్పర గొడవలు చేసుకోవడంతో తనకు రక్షణ కల్పించాలని లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయనకు కేంద్ర ప్రభుత్వం వై కేటగిరీ భద్రత కల్పించింది. దీంతోపాటు బయట ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ సైన్యాన్నీ మిథున్ పెట్టుకున్నారు.

బెదిరింపు ధోరణితో గతంలో మిథున్ ప్రెస్‌మీట్!

ఇటీవల ఎంపీ మిథున్ రెడ్డి తిరుపతిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'చల్లా బాబు నువ్వు చంద్రబాబు ట్రాప్‌లో పడకు, మా కుటుంబంలో రాజకీయాలు చేయడానికి చాలా మంది ఉన్నాం. నీవు ఒక్కడే ఉన్నావు' అని బెదిరించే ధోరణిలో చెప్పారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో చల్లా బాబుతో వైసీపీకి ఇబ్బందిగా ఉందని, ఏదైనా కుట్రకు పాల్పడే అవకాశం ఉంటుందని కుటుంబీకులతో పాటు అనుచరులు, టీడీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల కొందరు పుంగనూరు టీడీపీ నేతలు సీఎం చంద్రబాబును కలిసి పెద్దిరెడ్డి ఆగడాలను కట్టడి చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డికి ఎమ్మెల్సీ లేదా రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం గల పదవి ఇవ్వాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో చల్లా బాబుకు ప్రభుత్వం తొలగించిన గన్‌మ్యాన్ల భద్రతను తిరిగి కొనసాగించి అండగా నిలవాలని కోరుతున్నారు.

దారి చూపండి

- చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే భూ బాధితులు
- సర్వీస్ రోడ్డు కోసం నేడు చిత్తూరులో ధర్నా
- 22న వంటావార్పు
- సీపీఐ జాతీయ నేత నారాయణ రాక



చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేపై ధర్నా చేస్తున్న రైతులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 18: చిత్తూరు - తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతాంగం నోట్లో మట్టి కొట్టేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ యత్నిస్తోందని సీపీఐ, రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. మంగళవారం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఐ, రైతు సంఘం ప్రతినిధి వర్గం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా కారూర్, పాదిరి, బూచవానత్తం, అయనంబాకం, కాళికాపురం, దామరపాకం గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ... సీపీఐ, రైతు సంఘం సహకారంతో తమ భూములకు పరిహారం ఎకరాకు రూ.8 లక్షల నుంచి 16 లక్షలకు పెంచుకో గలిగామన్నారు. అయితే రహదారి పూర్తి కావస్తున్నా ఎంవోయూకు విరుద్ధంగా సర్వీస్ రోడ్డు నిర్మించక పోవడం దుర్మార్గమన్నారు. అలాగే పలు చోట్ల రోడ్డుకిరువైపులా ఉన్న గ్రామాలకు, పొలాలకు సబ్‌వే ఏర్పాటులో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి బుధవారం చిత్తూరులో ధర్నా, అలాగే 22న రహదారిపైన వంటా వార్పు కార్యక్రమం చేపట్టబోతున్నామని సీపీఐ, రైతు సంఘ నాయకులు ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, రైతు సంఘం నేత జనార్దన్, సీపీఐ జిల్లా నాయకులు చిన్నిరాజ్, మహేష్, గురుమూర్తి, చిరంజీవినాయుడు, కృష్ణారెడ్డి కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో బాలిక మృతి

జ్వరాలపై సమగ్ర విచారణకు జడ్పీ చైర్మన్ ఆదేశం



మృతి చెందిన మేఘన

వి.కోట, సెప్టెంబరు 18: వి.కోట పట్టణం ఏపీజే కలాం వీధికి చెందిన హరినాథ్ కుమార్తె మేఘన(13) డెంగ్యూతో చికిత్స పొందుతూ మృతి చెందింది. 8వ తరగతి చదువుతున్న మేఘన వారం రోజులుగా జ్వరం తగ్గక పోవడంతో కుటుంబీకులు బెంగళూరులోని రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. మంగళవారం సాయంత్రం అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. రాత్రి మృతదేహాన్ని వి.కోటకు తరలించారు. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వచ్చి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈసందర్భంగా తమ ప్రాంతంలోని గంగమ్మ ఏరులో మురుగు ప్రవహించడం వల్ల దోమలు పెరిగి అందరూ జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వి.కోట పట్టణంలో జ్వరాలపై సమగ్ర విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని ఓగు పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్‌కు ఆదేశాలిచ్చారు. స్థానిక సర్పంచ్ పీఎస్ లక్ష్మి, ఎంపీడీవో మహ్మద్ రఫీ, ఈవో శివశంకర్‌లు కూడా పారిశుధ్యంపై క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. బుధవారం రాత్రి పంచాయతీ సిబ్బంది దోమలను నివారణకు ఫాగింగ్, మురుగు నిల్వలపై మలాథీన్ పిచికారీ చేశారు. కాగా, ఏఎంజీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, బీజేపీ, జనసేన, వైసీపీ నేతలు కూడా మృతురాలి కుటుంబీకులను పరామర్శించారు.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



ఎన్డీయే శాసనపక్ష సమావేశంలో పాల్గొన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, నగరి, పలమనేరు, గంగాధరనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు భానుప్రకాష్, అమరనాథరెడ్డి, థామస్, గురజాల జగన్మోహన్, మురళీమోహన్

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గజ బాధిత రైతుకు నష్టపరిహారం చెక్కు అందజేత



రామకుప్పం, సెప్టెంబరు 18: ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రామకుప్పం మండలం పీఎంకేతాండాకు చెందిన రైతు ధనపాల్‌కు బుధవారం అటవీ ఉప క్షేత్రాధికారి ధనుంజయుడు, టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్‌లు రూ.18వేలు నష్టపరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏనుగుల దాడుల్లో పంటనష్టపోయిన ప్రతి రైతుకు అటవీశాఖ తప్పకుండా నష్టపరిహారం అందిస్తుందన్నారు. ఏనుగులు పంటపొలాల వైపు వస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అంతేతప్ప వాటిని రెచ్చగొట్టే విధంగా ఎటువంటి చర్యలకు పాల్పడరాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత మునిరాజనాయక్, అటవీ బీట్ అధికార్లు హరిబాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



సోమల, సెప్టెంబరు 18: పుంగనూరు మండలం కృష్ణమరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. బుధవారం సోమలకు చేరుకుని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద బసచేసి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సోమల సాయిబాబా ఆలయ భజన సంఘ సభ్యులు కలసి పాదయాత్ర బృంద సభ్యులకు అల్పాహారం, తాగునీటి బాటిళ్ళు అందజేసి ఆలయం వద్ద సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో జిల్లా జానపద కళాకారుల సంఘం మాజీ కార్యదర్శి మునిచంద్ర, విశ్రాంత బీసీ వెల్ఫేర్ అధికారి మునివెంకటప్ప, ఆటో యూనియన్ అధ్యక్షుడు మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సు సర్వీసు ప్రారంభం



కుప్పం, సెప్టెంబరు18: కుప్పం ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన బస్సు సర్వీసును బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో కుప్పంనుంచి పదుల సంఖ్యలో బస్సులు ఇతర డిపోలకు తరలి వెళ్లిపోయాయని, దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పలువురు టీడీపీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సులో సీట్లు ఇవ్వలేదని విద్యార్థిపై దాడి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు18: బస్సులో సీట్లు ఇవ్వలేదని ప్రయాణికులు విద్యార్థిపై దాడి చేసిన ఘటన బుధవారం పుంగనూరు మండలంలో జరిగింది. మొరంపల్లెకు చెందిన నాగరాజ కుమారుడు రెడ్డిప్రసాద్ పుంగనూరులో డిగ్రీ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో పుంగనూరు- రాయలపేట ప్రైవేటుబస్సులో రెడ్డిప్రసాద్ కాలేజీకి వెళ్లడానికి ప్రయాణించాడు. కూలిపనుల కోసం పుంగనూరుకు వచ్చిన మొరంపల్లె గంగులప్ప, నల్లగుట్లపల్లెకు చెందిన జ్యోతీశ్వర్, దయానంద, ఏతూరుకు చెందిన నవీన, సొసైటీకాలనీకి చెందిన సంతోష్, మరో విద్యార్థి గంగాధర్‌లు సీటు ఇవ్వలేదని రెడ్డిప్రసాద్‌పై ఘర్షణకు దిగినట్లు తెలిపారు. ఈ దాడిలో రెడ్డి ప్రసాద్ గాయపడగా తోటి ప్రయాణికులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దాడి కేసులో ఏడుగురి అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

కుప్పం, సెప్టెంబరు 18: కుప్పం పురపాలక సంఘం మునస్వామిపురంలో ఈనెల 13వ తేదీన ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఏడుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడుతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య వినాయక చవితి చందా విషయంలో ఘర్షణ మొదలైందన్నారు. ఈ ఘర్షణలో ఒక వర్గంవారు వినయ్ అనే వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఆయనిప్పుడు బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ కేసులో ఆర్వై.బాలనాగరాజ్, ఆర్వై.శ్రావణ్ రాజ్, ఆర్వై.శివసాయిరాజ్, ఎన్.తరుణ్ కుమార్, ఎస్.ఆది, ఆర్.ఉమాశంకర్, ఎ.జ్ఞాన ప్రకాశ్ అనే యువకులను అరెస్టు చేసి కోర్టు సూచన మేరకు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. నిందితులనుంచి ఒక కత్తితోపాటు, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రశాంతమైన కుప్పంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఈ సంఘటననైనా ఉపేక్షించేది లేదన్నారు.

ప్లాస్టిక్ వద్దు ... వెదురు అల్లికలే ముద్దు



వెదురు సామగ్రికి పూజలు చేస్తున్న మేదర సంఘ నేతలు

గంగవరం, సెప్టెంబరు 18 : కాలుష్యాన్ని సృష్టించే ప్లాస్టిక్ కన్నా వెదురు అల్లికలే ముద్దు అన్న నినాదంతో మేదరులంతా ముందుకెళ్లాలని మేదర సంఘ జిల్లా అధ్యక్షుడు పోలేపల్లి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా పలమనేరులో మేదర సంఘం ఆధ్వర్యంలో వెదురు బొమ్మలు, వెదురు అల్లిక వస్తువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించాలంటే వెదురు అల్లికల వస్తువులను విరివిగా తయారుచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. వెదురు వస్తువులను ప్రజలు ఆదరించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో మేదరసంఘ నేతలు శ్రీనివాసులు, రామచంద్ర, శ్రీకాంత్, మునుస్వామి, కనికరం శివ, కుమార్, మీనమ్మ, మంజులమ్మ, విజయ, మల్లిక, సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ లీలారాణి

గంగవరం, సెప్టెంబరు 18 : ప్రస్తుత పోటీతత్వానికి అనుగుణంగా విద్యార్థులకు ఎలా బోధించాలనే అంశంపై ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఎంఈఓ లీలారాణి పిలుపునిచ్చారు. బుధవారం పలమనేరు మండలంలోని సీఆర్పీ సెంటర్లు, ఉర్దూ ఉన్నతపాఠశాల, గర్ల్స్ హైస్కూల్‌లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సాంకేతిక, ఆధునిక బోధనాంశాలపై ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 18: తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని గడ్డూరు ఆరోగ్యఉపకేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వ్యాధినిరోధక టీకాల గురించి ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్యజాగ్రత్తల గురించి వివరించారు. ఇంకా వ్యక్తిగత, పరిసరాలశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ పూర్ణ, ఏఎన్ఎం సుజాత, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగిరిగుంటలో ఏనుగుల సంచారం

చౌడేపల్లె, సెప్టెంబర్ 18: సింగిరిగుంట సమీపంలో ఏనుగులు రెండు రోజులుగా తిష్టవేశాయి. మంగళవారం రాత్రి నుంచి సింగిరిగుంట అటవీ ప్రాతంలో 14 ఏనుగుల గుంపు సంచరిస్తున్నాయి. పొలాల్లోకి రైతులు వెళ్లాలంటే భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు ఏనుగులు అడవిలోకి పంపేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న భీష్మ విజయం హరికథ



సోమల, సెప్టెంబరు18: మండలంలోని కందూరులో మహాభారత యజ్ఞం సందర్భంగా బుధవారం హరికథ భాగవతారిణి గీతాశ్రీ ఆలపించిన భీష్మ విజయం భక్తులను ఆకట్టుకుంది. భీష్ముడి గురించి వినసొంపుగా అర్థమయ్యే రీతిలో శ్రోతలకు వినిపించారు. రాత్రి శ్రీకృష్ణ లీలలు నాటక ప్రదర్శనకు ఉభయదారులుగా బాల వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జోరుగా సీసీ రోడ్ల నిర్మాణాలు



కుప్పం, సెప్టెంబరు18: సుమారు పది రోజులనుంచి కుప్పం నియోజకవర్గంలోని పల్లెపల్లెనా సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమై కొనసాగుతున్నాయి. పంచాయతీరాజ్‌ను ఉపాధి హామీతో అనుసంధానం చేసి రోడ్లను నిర్మిస్తున్నారు. కుప్పం మండలం వానగుట్టపల్లెలో బుధవారం కొత్త సీసీ రోడ్డుకు టీడీపీ నాయకులు, అధికారులు కలిసి భూమి పూజ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నాయకులు శివకుమార్ రాజగోపాల్, మహేంద్ర, స్వాతి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని ఇళ్లకు నీటి కొళాయి కనెక్షన్ కట్

పుంగనూరు, సెప్టెంబరు 18: పుంగనూరు మున్సిపల్ పరిధిలోని ఆస్తి, నీటి పన్నులు చెల్లించని ఇళ్లకు తాగునీటి కొళాయి కనెక్షన్లు తొలగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని సూర్యానగర్‌లో పన్నులు చెల్లించని ఇళ్లకు నీటి కొళాయి కనెక్షన్ తొలగించినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ సూర్యనగర్‌లో అధిక మొత్తాలు పన్నులు చెల్లించాల్సివుందన్నారు. కార్యక్రమంలో ఆర్వో సతీష్, కమలాకర్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

హెడ్‌నర్సుపై మంత్రికి ఫిర్యాదు

పుంగనూరు, సెప్టెంబరు 18: పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో హెడ్‌నర్సు మధుబాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బుధవారం ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా కార్యదర్శి పి.అయూబ్‌ఖాన్ తెలిపారు. పుంగనూరు వైద్యశాల 100 పడకల తరహా వైద్యం అందడంలేదని, స్థానికంగా ఉన్న వారి వల్ల గ్రూపులు, నర్సులు, ఇతర సిబ్బందిపై హెడ్‌నర్సు పెత్తనం చేయడం, గతంలో వైద్యాధికారిపై జరిగిన దాడి, రోగులకు వైద్యం ఇవ్వకుండా రెఫర్ చేయడం గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లానని ఆంధ్రజ్యోతికి చెప్పారు.

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 18 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో బుధవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఎంఈవో సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. పాఠశాలల్లో ప్రస్తుతం 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 25వ తేది పాఠశాలస్థాయిలో, అక్టోబరు 2న మండలస్థాయి, అక్టోబరు 27న జిల్లాస్థాయి, నవంబరు 9,10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో టాలెంట్‌టెస్ట్ వుంటుందని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎంఈవో కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞనవేదిక కన్వీనర్ శశికుమార్, హెచ్ఎంలు నసీబ్‌జాన్, సంగీత, రత్నమ్మ, ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి, సెప్టంబరు 18: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపంజాణి మండలం రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద ద్విచక్ర వాహనంలో 1008 కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లను తరలిస్తుండగా ఎస్ఐ సహదేవి తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న కొళత్తూరు పంచాయతీ గల్లావారిపల్లెకు చెందిన శ్రీరాములును అరెస్టు చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచామని పేర్కొన్నారు.

గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

చౌడేపల్లె, సెప్టెంబర్ 18: మండలంలో గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకుడు ప్రదీప్ రాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో గోకులం పథకం, వాటి నిర్మాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులందరికి మంజూరు చేయాలని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో కృష్ణవేణి, పశువైద్యాధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు18: పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆడియాలజీ టెక్నీషియన్ మునివేలు తెలిపారు. బుధవారం స్థానిక భవిత కార్యాలయంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 20మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెవిటి, మూగ పిల్లలను తల్లిదండ్రులు పిల్లల అవసరాలు గుర్తించాల్సివుందన్నారు. భవిత సిబ్బంది, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి పూజలు



విశేష అలంకరణలో అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి, భక్తులతో కిక్కిరిసిన కాశీవిశ్వేశ్వరాలయం, విశేషాలంకరణలో శేషాద్రిస్వామి

రామకుప్పం, సెప్టెంబరు 18: పట్టణంలోని అన్నపూర్ణదేవీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. పురోహితులు కృష్ణమూర్తి, హరినాథ్‌లు రాత్రి స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి అమ్మవారు, స్వామి ఉత్సవర్లను మంగళవాయిద్యాలు, డప్పుల హోరు మధ్య మాడవీధుల్లో ఊరేగించారు.

శేషాద్రిస్వామి ఆలయంలో పౌర్ణమిపూజలు

బైరెడ్డిపల్లె : పట్టణంలోవున్న శేషాద్రిస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి అభిషేకంచేసి విశేషాలంకరణతో పూజలు జరిపారు. నిర్వాహకులు ధనంజయ గౌడు ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, కళాకారుల భక్తిగీతాలాపన కార్యక్రమాలు జరిగాయి. అలాగే పట్నపల్లె కల్యాణవెంకన్న ఆలయం, కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయం, కడపనత్తం నలగుండ్రాయ స్వామి ఆలయంలో కూడా ప్రత్యేకపూజలు జరిగాయి.

శాస్త్రోక్తంగా చండీహోమం



చౌడేపల్లె, సెప్టెంబర్ 18:ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో వేదపండితులు చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం పౌర్ణమి సందర్భంగా వేద ఆశీర్వద మండపం వద్ద కలశ స్థాపన చేసి, అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించారు. అమ్మవారి మూల మంత్రాన్ని భక్తులచే పఠింప చేసి, సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం గణపతి, ఆదిత్యాది, నవగ్రహ చండీ హోమాన్ని భక్తులచే ఆచరింపజేసారు. భక్తులు హోమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏకాంబరం, భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, సోమలలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం

కల్లూరు, సెప్టెంబర్ 18: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో రాజశేఖర్ బాబు పిలుపునిచ్చారు. పులిచెర్ల మండలం నన్నూరివారిపల్లి పంచాయతీలో నిర్వహించిన స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మురుగునీటి కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు, బహిరంగ మలమూత్ర విసర్జనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతే అందరి ఆరోగ్యమని తెలిపారు. అనంతరం పలురకాల మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, శివశంకరరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సోమల : సోమల పంచాయతీలో జల్ మిషన్ కార్యక్రమంపై గ్రామ సభను సర్పంచు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. అలాగే ఏక్‌పేడ్ మాకే నామ్ కార్యక్రమం సందర్భంగా పలు రకాల మొక్కలు నాటారు. క్లాత్ మిత్రలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, ఈవోపీఆర్డీ లక్ష్మిదేవి, కార్యదర్శి సుధాకర్‌కుమార్ , వీఆర్వో శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాలు



విరాళాల మొత్తాన్ని అనందరెడ్డికి అందజేస్తున్న నేతలు, చెక్కును అందిస్తున్న ఆస్టర్ హాస్పిటల్ డైరెక్టర్లు

రామకుప్పం, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితులకు రామకుప్పం మండలం పంద్యాలమడుగు పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు రూ.1,11,116 విరాళంగా ఇచ్చారని తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మెన్ గంటప్పగౌడు, పార్టీ పంచాయతీ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సేకరించిన విరాళాల మొత్తాన్ని వారు బుధవారం టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మహ్మద్‌రఫీ, కామరాజనాయక్, నవీన్, గజేంద్ర, మురళీలు పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : విజయవాడ వరద బాధితులకోసం ఆస్టర్ హాస్పిటల్ తరఫున డైరెక్టర్లు ప్రవీణ్, కుమార్‌లు టీడీపీ సలహాదారు పి.నరేశ్ ఆచారికి రూ.1.50 లక్షలు విలువ కలిగిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ వాసులకు రాకూడని కష్టం వచ్చిందని, మానవతా దృక్పథంతో సాయం చేశామని చెప్పారు.


పలమనేరు ఎంపీడీవోగా ఖాదర్‌బాషా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18: పలమనేరు ఎంపీడీవోగా ఖాదర్‌బాషాను నియమిస్తూ జడ్పీ సీఈవో గ్లోరియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరు ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉండడంతో అక్కడ ఏవోగా ఉన్న రాజేష్ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా వ్యవహరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో కుప్పంలో పనిచేసిన ఖాదర్‌బాషాను పలమనేరుకు బదిలీ చేశారు. రాజేష్ ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తారు.

మహిళపై కత్తితో దాడి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 18: వినాయక నిమజ్జనంలో అరుపులు, కేకలు ఎక్కువగా ఉండటంతో ఓ మహిళ యువకులను మందలించడంతో వారు ఆగ్రహంతో మహిళపై కత్తితో దాడి చేసిన ఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. చౌడేపల్లె మండలం బత్తలాపురంలో బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జనానికి స్వామివారిని తరలిస్తున్న సమయంలో యువకులు ఈలలు, కేకలు వేస్తున్నారు. ఈ సమయంలో అదేగ్రామానికి చెందిన అనసూయ ఆ యువకులను మందలించగా బన్నీ అనే యువకుడు కత్తితో దాడి చేశాడు. గాయపడిన అనుసూయ పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది.

బాలికకు సహచర విద్యార్థుల కన్నీటి వీడ్కోలు



మేఘనకు కన్నీటి వీడ్కోలు పలుకుతున్న సహచర విద్యార్థులు

వి.కోట, సెప్టెంబరు 18: డెంగ్యూ బారినపడి ఇన్‌ఫ్యాంట్ జీసెస్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి మేఘన మృత్యువాత పడడంతో సహచర విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. బుధవారం ఆ బాలిక మృతదేహం వద్దకు చేరుకున్న ఎంఈవో చంద్రశేఖర్, ఇతర ఉపాధ్యాయులు ఆమెకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆపై మధ్యాహ్నం కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య ఆ బాలికకు అంత్యక్రియలు పూర్తి చేశారు.

పాఠశాలలకు పెద్దబాలశిక్ష పుస్తకాల వితరణ

గంగవరం, సెప్టెంబరు 18 : పలమనేరు, గంగవరం మండలాల పరిధిలోని పాఠశాలలన్నింటికీ తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఆధ్వర్యంలో ఈశ్వరప్రసాద్ ముద్రించిన పెద్దబాలశిక్ష పుస్తకాలను ఉచితంగా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..కొలమాసనపల్లె హైస్కూల్ హెచ్ఎం ఈశ్వరప్రసాద్ విద్యార్థులందరికీ మన తెలుగుభాష ప్రాముఖ్యత, తెలుగుపదాల అర్థాలను తెలియజేయాలనే లక్ష్యంతో ఈ పుస్తకాలను తయారుచేసి పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో సంస్థకార్యదర్శి పుష్ప, ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, లీలారాణి, బాలసుందరం లతోపాటు పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 18: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన పుంగనూరు శివార్లలోని నక్కబండ వద్ద జరిగింది. బుధవారం రాత్రి నక్కబండకు చెందిన సురేంద్ర(53) బట్టందొడ్డికి పని చూసుకుని నక్కబండకు వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వెంటనే 108కు సమాచారం ఇవ్వగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయగా పరిస్థితి విషమంగా ఉండడంతో సురేంద్రను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



గుడుపల్లె, సెప్టెంబరు18: మండల పరిధిలోని గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లె సమీపంలోని నక్కనపల్లె రెవెన్యూలోని సర్వే నెం.62లో 15.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో వైసీపీ చెందిన కొందరు అక్రమంగా క్వారీ నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అక్రమ క్వారీని అధికారులు నిలుపుదల చేశారు. ఆ తరువాత ఇదే భూమిని కొందరు ఆక్రమించుకొని భవన నిర్మాణాలు, వ్యవసాయం పనులు చేపట్టారు. వీటిపై గుత్తార్లపల్లె గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ భూమి వద్దకు చేరుకొన్న రెవెన్యూ అధికారులపై ఆక్రమణదారులు దాడులు చేశారు. గత నెలలో కుప్పంలో కలెక్టరు సుమిత్ కుమార్ నిర్వహించిన గ్రీవెన్సులో సర్వే నెం.62లోని ఉన్న 15.20 ఎకరాల ప్రభుత్వ భూమి కాపాడాలని గుత్తార్లపల్లె గ్రామస్తులు కొందరు వినతి పత్రం అందించారు. కలెక్టరు ఆదేశాల మేరకు తహసీల్దారు సీతారాం, సర్వేయర్లతో కలిసి బుధవారం ప్రభుత్వ భూమిని సర్వే చేయించారు. ఆ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, రెవెన్యూ, పంచాయతీ ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కల్లూరు, సెప్టెంబర్ 18: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎంఈఓలు శిద్దరామయ్య, పోకలతాతయ్య తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, టీబీ తదితర వ్యాధులపై మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఎంఈఓలు మాట్లాడారు. ఎయిడ్స్‌కు మందులేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. ఎయిడ్స్‌పై పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహాలు పాటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. హెచ్ఎం సయ్యద్‌సాహేబ్‌వల్లి, కోర్ సంస్థ ప్రతినిధులు రాజమ్మ, షర్మిళ, రెడ్డిరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

● మినీ లారీ వాహనం సీజ్ - ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 18: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీన పరచుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, మినీ లారీని సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని పాలేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా, బెంగళూరు వైపు నుంచి చెన్నైకి వెళ్తున్న మినీ లారీని ఆపగా, ఆ వాహనం డ్రైవర్ వాహనాన్ని వదిలి పరుగెత్తడంతో అతడిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేసి, క్యాబిన్‌లో ఉన్న 25 కర్ణాటక మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనపరచుకుని, వారిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తూత్తుక్కుడి జిల్లా, మధురాంతకం గ్రామానికి చెందిన అయ్యప్ప, బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లికి చెందిన చంద్రమోహన్ నాయుడులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అసంపూర్తిగా వున్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి 28న నూతన కార్యక్రమం: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: వివిధ దశల్లో అసంపూర్తిగా వున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈనెల 28న 'మన ఇల్లు - మన గౌరవం' పేరిట నూతన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఎం ఆవాస్ యోజన కింద కేటాయించిన ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఇంతవరకు 77,366 ఇళ్ళు మంజూరుకాగా, వాటిలో 47,324 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ పద్మనాభం పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

- 18 మందిపై కేసు నమోదు - రూ.86,109 లభ్యం
- 7 ద్విచక్ర వాహనాలు, 15 ఫోన్ల స్వాధీనం

పెనుమూరు, సెప్టెంబరు 18: పెనుమూరు మండల పరిధిలోని కలిగిరి పంచాయతీ ఓబయ్యగారిపల్లి వద్ద పంట పొలాల్లో కోడి పందేలు ఆడుతున్నారని బుధవారం సమాచారం రావడంతో స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 18 మందిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.86,109తో పాటు 7 ద్విచక్ర వాహనాలు, 15 సెల్‌ఫోన్లు, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్బీ సీఐ మల్లికార్జున్, ఎస్ఐ అనిల్‌కుమార్‌లు వారిని పెనుమూరు పోలీసులకు అప్పగించడంతో, కేసు నమోదు చేసినట్లు రైటర్ మధు తెలిపారు.

మృతుడి భార్యకు ఆర్థికసాయం



చెక్కును అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, సెప్టెంబరు 18: జిల్లాలోని నింద్ర పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన వినోద్‌కుమార్ భార్యకు ప్రభుత్వం ఆర్థికసాయాన్ని ప్రకటించింది. బుధవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ ఐడీఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.లక్ష చెక్కును మృతుడిభార్య కళావతికి అందించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ నుంచి సహాయ సహకారాలను అందిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు. హోంగార్డు ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న పార్థసారథి నాయుడు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18: నగరంలోని గంగణపల్లిలో నివాసముంటున్న హబీబ్ కుమార్తె మాన్‌తూషా ఇంటర్ బైపీసీలో 1000 మార్కులకుగాను 912 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో కూడా మంచి ర్యాంకు సాధించడంతో మెరిట్ కింద స్విమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్‌లో సీటు వచ్చింది. అయితే ట్యూషన్ ఫీజు, హాస్టల్ తదితర ఫీజులు చెల్లించడానికి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో చిత్తూరు మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడును సంప్రదించారు. దీంతో ఆయన వెంటనే స్పందించి బుధవారం మాన్‌తూషా చదువుకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దాతలు కూడా ముందుకు వచ్చి సాయం అందించాలని, 94947 47823 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18: చిత్తూరు మండలంలోని గాజులపల్లి సమీపంలోని సమంతా స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు శ్రీలత మోడ్రన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్కూల్‌లోని విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించి సూచనలు చేశారు. శరీరంలో అతి ముఖ్యమైన కంటిని విద్యార్థులు జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ చక్రధర్‌నాయుడు, ఉపాధ్యాయులు సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ కారిడార్‌కు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18: చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ కారిడార్‌కు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు డిమాండ్ చేశారు. బుధవారం నేషనల్ హైవే కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైవే కోసం భూములు ఇచ్చిన రైతులను ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదన్నారు. సర్వీసు రోడ్డు లేకుండా రైతులు వారి భూములకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. వెంటనే సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకుంటే పెద్దఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు గోపీనాథ్, మణి, విజయగౌరి, సంతోష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి

వెదురుకుప్పం, సెప్టెంబరు 18: విద్యాభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి తమతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ వంతు సహకారం అందించాలని కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.స్వరూప తెలిపారు. బుధవారం ఆ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతోందని, తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఇళ్ల వద్ద దృష్టి సారించి వారు క్రమశిక్షణతో మెలిగే విధంగా చూడాలన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్



నగరి, సెప్టెంబరు 18: నగరి మండల పరిధిలోని నాగరాజుకుప్పం వద్ద మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను తహశీల్దార్ రవికుమార్ బుధవారం సీజ్ చేశారు. నాగరాజుకుప్పం క్వారీ వద్ద బుధవారం తనిఖీ చేయడానికి వెళ్లిన తహశీల్దార్‌కు మట్టితో వెళుతున్న టిప్పర్ కనిపించడంతో సీజ్‌చేసి రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. తొలి హెచ్చరికగా రూ.25,000 జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ మరోసారి ఇదే టిప్పర్ పట్టుబడితే రెండవ హెచ్చరికగా రూ.50,000 అపరాధం వేస్తామని, ఆపై పట్టుబడితే టిప్పర్ సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 18: వ్యాన్ డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన కేసులో ఇద్దరిని ఎంఆర్‌పల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చంద్రగిరి సబ్ డివిజన్ డీఎస్పీ నరసింగప్ప కథనం మేరకు...వెదురుకుప్పం మండలం చిన్నగారిపల్లికి చెందిన బైరాగి రమేష్ బొలేరో పికప్ వ్యాన్ పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో గతనెల 31న తనపల్లి క్రాస్ వద్ద వ్యాన్ ఆపి టీ తాగుతున్న రమేష్‌పై తనపల్లి మాదిగవాడకు చెందిన కాకలూరి హేమ సుధాకర్, వేణులు ఒక్కసారిగా కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన హేమ సుధాకర్ పిచ్చాటూరు పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసులో .అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చాడు. గాజులమండ్యం స్టేషన్ పరిధిలో కొట్లాట కేసులో కూడా నిందితుడు. .ఇతడు, తనపల్లికి చెందిన వేణు కలిసి గంజాయి, మద్యం తాగి హత్యాయత్నానికి పాల్పడ్డారని డీఎస్పీ చెప్పారు. ఇరువురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చిత్తూరు, సెప్టెంబరు 18: తనను కులం పేరుతో దూషించారని ఒక వ్యక్తి కేసు పెడితే.... లంచం ఇవ్వమని బెదిరించాడని మరో వ్యక్తి కేసు పెట్టారు. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకటవ పట్టణ పోలీసుల కథనం మేరకు... ఒక విలేకరి నగరంలోని ఓ కళాశాల నిబంధనల మేరకు నడవటం లేదని ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును స్వీకరించిన ఆర్ఐవో కార్యాలయ అధికారులు కళాశాలలో తనిఖీకి వెళ్లారు. వారితో పాటు ఆ విలేకరి కూడా వెళ్లగా, కళాశాల యాజమాన్యం తనను కులం పేరుతో దూషించిందని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఆర్‌టీఐ కింద వివరాలు అడిగిన తరువాత లంచం డిమాండ్ చేశాడని, తాము ఇవ్వలేమని చెప్పడంతో తమపై తప్పుడు కేసు పెట్టాడని కళాశాల నిర్వాహకుడు సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులను దుర్భాషలాడారని కేసు

చిత్తూరు, సెప్టెంబరు 18: పోలీసులను దుర్భాషలాడిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 16వ తేదీన కట్టమంచిలో తన కుమారుడు రోహిత్ మద్యం సేవించిన మత్తులో తనపై దౌర్జన్యం చేస్తున్నాడని అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అక్కడికి చేరుకుని వారించే ప్రయత్నం చేయగా, రోహిత్ వారిపై తిరగబడ్డాడు. దీంతో తమపట్ల అనుచితంగా ప్రవర్తించిన రోహిత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధులకు అన్నదానం



వెదురుకుప్పం, సెప్టెంబరు 18: కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలో బుధవారం ఎస్ఆర్‌పురం మండలం మూలూరు గ్రామానికి చెందిన నరసింహా మండడి వితరణతో అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు.

వీఆర్వో రాజ్‌కుమార్ మృతి



బంగారుపాళ్యం, సెప్టెంబరు 18: మండలంలోని టేకుమంద వీఆర్వో రాజ్‌కుమార్ బుధవారం ఉదయం మృతిచెందారు. తుంబకుప్పం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ మండలంలోని పలు పంచాయతీల్లో వీఆర్వోగా పనిచేస్తూ సేవలందించారు. ఆయన మృతిపట్ల మండల టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు జయచంద్ర నాయుడు, సూరి నాయుడు, జనార్దన్ గౌడ్, రమేష్, తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, పలువురు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

టీచర్లు నిత్యవిద్యార్థిగా కొనసాగాలి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 18: టీచర్లు వివిధ అంశాల గురించి తెలుసుకుంటూ నిత్యవిద్యార్థిగా కొనసాగాలని డిప్యూటీ డీఈవో చంద్రశేఖర్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె జడ్పీ హైస్కూల్లో బుధవారం సీఆర్‌సీ సమావేశంలో హిందీ, సోషియల్ సబ్జెక్ట్ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్లు సాంకేతిక మార్పులపట్ల అవగాహన పెంపొందించుకుకుని విద్యార్థులకు బోధన చేయలన్నారు. ఎంఈవోలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, నెల్లేపల్లె హెచ్ఎం సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జి హెచ్ఎం యుగంధర ఆచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో చంద్రశేఖర్

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది



కోసలనగరం సచివాలయంలో బుధవారం ఉదయం 10:18 గంటలకు హాజరైన ఇద్దరు సిబ్బంది

విజయపురం, సెప్టెంబరు 18: మండలంలోని సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిన సిబ్బంది 11 గంటలు అయినా కార్యాలయానికి రావడం లేదని, సాయంత్రం 5 గంటల వరకు ఉండాల్సిన వారు 4 గంటలకే కనిపించడం లేదని వాపోతున్నారు. కొందరు సమయానికి కార్యాలయానికి వచ్చినా బయోమెట్రిక్ హాజరు వేసుకొని సొంత పనుల నిమిత్తం వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ శాతం సిబ్బంది స్థానికులే కావడంతో హాజరు వేసుకొని ఇంటికి వెళుతున్నారని చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సచివాయ సిబ్బంది మధ్య సఖ్యత లోపించడంతో ఎవరికి వారే యమునా తీరు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఒకటి రెండు తేదీల్లో పింఛన్ల పంపిణీ తరువాత సిబ్బంది సకాలంలో కార్యాలయాలకు రావడం లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్న

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 18: మండలంలోని గొల్లపల్లె గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్న తెలిపారు. ఇన్‌చార్జి సీఐ కథనం మేరకు... గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట పంచాయతీ గొల్లపల్లెలోని ఓ కోళ్ళఫారంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారని బుధవారం ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్నకు సమాచారం అందింది. పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన కోళ్ళఫారంపై దాడులు చేశారు. ఈదాడిలో తమిళనాడుకు చెందిన రేషన్ ఉప్పుడు బియ్యం, పచ్చి బియ్యం కలిపి బస్తాల్లో నింపి ఉండటాన్ని గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదు టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్లు ఆయన తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నయ్య

చిత్తూరు, సెప్టెంబరు 18: స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను వంద శాతం పూర్తి చేయాలని చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, కమిషనర్ నరసింహ ప్రసాద్‌లు ఎన్నికల సూపర్‌వైజరీ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో ఎన్నికల సూపర్‌వైజరీ అధికారులతో స్పెషల్ సమ్మరీ రివిజన్-2025పై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీ రివిజన్ ఇంటింటి సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఒక కుటుంబంలోని సభ్యుల పేర్లన్నీ ఒకేచోట ఉండేలా చూడాలన్నారు. ఇంటి నెంబర్లలో పొరబాట్లు, పేర్లు, చిరునామాల్లో తప్పులుంటే గుర్తించాలన్నారు. ఎన్నికల విధులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందన



నగరి, సెప్టెంబరు 18: ఇటీవల కాకినాడ జిల్లా అన్నవరంలో నిర్వహించిన 9వ సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో ప్రథమస్థానం సాధించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో ప్రతిభ కనబరిచిన కె.సిద్ధిక్‌ను బుధవారం అభినందించారు. నగరి పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థి సిద్ధిఖ్ అంతర్ జిల్లాల సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపినందుకు కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు.

ఉపాధి హామీ సమస్యలపై స్పందించరా...?: టీడీపీ

విజయపురం, సెప్టెంబరు 18: విజయపురం మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సమస్యలపై ఏపీవో స్పందించడం లేదని కేవీపురం, ఎం.అగరం టీడీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం విజయపురంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. గ్రామంలో ఉపాధి పనులపై, సమస్యలపై ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని చెప్పారు. క్షేత్రస్థాయిలో జరిగే వివరాల నివేదికను ఉన్నత అధికారులకు సమర్పించకుండా గతంలో పని చేసిన వారితో చేతులు కలిపి కాలయాపన చేస్తున్నారని, ఈ విషయమై అధికారులు ఏపీవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబునాయుడు, ధామునాయుడు, రామకృష్ణనాయుడు, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు తహసీల్దార్ కార్యాలయాన్ని పాత కలెక్టరేట్‌కు తరలించొద్దు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని పాత కలెక్టరేట్‌కు తరలించ వద్దంటూ మండల టీడీపీ నేతలు, గ్రామీణ ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం జేసీ విద్యాధరిని కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని అధికారులు పాత కలెక్టరేట్ కార్యాలయానికి తరలిస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. చిత్తూరు రూరల్ మండలం ఎన్ఆర్‌పేట, చెర్లోపల్లె, తుమ్మింద తదితర ప్రాంతాల నుంచి సమస్యల కోసం పాత కలెక్టరేట్‌కు వచ్చేందుకు దూరాభారం అవుతోందన్నారు. ప్రజలకు అనువుగా ఆర్డీవో కార్యాలయంలో లేదా పాత డీపీవో కార్యాలయానికి మార్పు చేయాలంటూ వారు కోరారు. జేసీని కలిసిన వారిలో మోహన్‌రాజ్, శశిర్‌బాబు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

తవణంపల్లె, సెప్టెంబరు 18: ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించి, భక్తులకు దర్శనం గావించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాల నడుమ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

అవగాహనతోనే అధిక దిగుబడి

గుడిపాల, సెప్టెంబరు 18: రైతులు పండించే ఏ పంట అయినా అవగాహనతో పండిస్తే నష్టపోకుండా ఆర్థికంగా అభివృద్ధి చేయొచ్చని జిల్లా వనరుల కేంద్ర అధికారిణి లక్ష్మీప్రసన్న, మండల వ్యవసాయ అధికారిణి మాధవి అన్నారు. బుధవారం మండలంలోని రైతులకు పంటలపై శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులు కేవైసీ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల కోసం స్థల పరిశీలన

పెనుమూరు, సెప్టెంబరు 18: మండలంలో విద్యాసంస్థల కోసం స్థలాన్ని ఆర్డీవో చిన్నయ్య తహసీల్దారుతో కలిసి బుధవారం పరిశీలించారు. జేసీ ఆదేశాల మేరకు పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. చార్వాగానిపల్లి, సీఎస్ అగ్రహారం వద్ద రెండు ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లతో గురువారం తన కార్యాలయానికి రావాలని తహసీల్దారు, సర్వేయర్‌లకు సూచించారు. తహసీల్దారు కళ్యాణి, సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: ఇండియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమంలో కొనసాగుతున్న ఆరురోజుల శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా డీఆర్డీఏ పీడీ తులసి పాల్గొని మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పొందిన అభ్యర్థులు ముున్ముందు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీఎం నాగేశ్వరరావు, ఇన్‌సెట్ డైరెక్టర్ ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ వితరణ



వెదురుకుప్పం, సెప్టెంబరు 18: కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలో జి.రామిరెడ్డికి వీల్‌చైర్‌ను జనసైనికులతో కలసి ఆ పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ పొన్న బుధవారం అందించారు. యుగంధర్ మాట్లాడుతూ రామిరెడ్డికి కాలు లేదని, దీంతో ఇబ్బంది పడుతుంటే తమ పార్టీ తరపున వీల్‌చైర్ అందించామన్నారు. ఆయన వెంట కార్వేటినగరం టౌన్ కమిటీ అధ్యక్షుడు రాజేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించండి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు స్వయం సహాయక సంఘాల మహిళలు అవగాహన కల్పించాలని డీఆర్డీఏ పీడీ తులసి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో మహిళ అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో, వాటర్ ఆర్గ్ సంస్థ సహకారంతో నీరు - పారిశుధ్యం - పరిశుభ్రతపై జిల్లాస్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు సూచనలు అందజేశారు. ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, డీఆర్డీఏ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 18: కార్వేటినగరం శివాలయం వీధిలోని ఒకటవ, రెండవ వార్డుల్లో ఎండీఎం వాహనాల ద్వారా రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరుకులను సరిగ్గా పంపిణీ చేయడం లేదని బుధవారం కార్వేటినగరం తహసీల్దార్ భగవతికి లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. తమకు ప్రభుత్వం ఇచ్చే నిత్యావసర సరుకులను సకాలంలో సజావుగా ఇచ్చే విధంగా చూడాలని కోరారు.

తహసీల్దార్ వ్యవహారంపై ఆర్డీవోకు ఫిర్యాదు

కార్వేటినగరం తహసీల్దార్ భగవతి సమస్యలను విన్నవించడానికి వెళ్లిన వారి పట్ల దురుసుగా మాట్లాడుతున్నారని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం ఆరోపించారు. బుధవారం కార్వేటినగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ వ్యవహారంపై నగరి ఆర్డీవో వెంకటరెడ్డికి ఫిర్యాదు చేశామని చెప్పారు.

ముక్కరవానిపల్లె సమస్య పరిష్కరించకుంటే ఉద్యమం

ముక్కరవానిపల్లె రెవెన్యూ లెక్కదాఖలాల్లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని చెరకు పంట సాగు చేసుకున్న లోకనాథరెడ్డిపై చర్యలు చేపట్టి, చెరకు పంటను కాపాడకపోతే ఉద్యమిస్తామని కొత్తపల్లి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బుధవారం రైతులతో కలసి వెళ్లి తహసీల్దార్‌ను కలసి ఈ విషయంపై ఫిర్యాదు చేశామన్నారు.

మొక్కలతోనే జీవులకు మనుగడ

చిత్తూరు, సెప్టెంబరు 18: మొక్కలతోనే మానవులు, ఇతర జీవుల మనుగడ సాధ్యమవుతుందని సహాయ కమిషనర్ ప్రసాద్ చెప్పారు. స్వచ్ఛతా హీ సేవ 2024లో భాగంగా బుధవారం కొంగారెడ్డిపల్లె పూల మార్కెట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. డంపింగ్‌యార్డు, వార్డు సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. పాఠశాలల్లో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడంతో పాటు నగరంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఎంహెచ్‌వో అనిల్‌కుమార్‌నాయక్, ఆర్వో గోపాలకృష్ణవర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, నరసింహ, స్థానిక ప్రముఖులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వ స్థలాల్లో పంచాయతీలకు ఆదాయాన్నిచ్చే మొక్కలను నాటాలని ఎంపీడీవో రామనాథరెడ్డి కోరారు. స్వచ్ఛతా హీ సేవా, వనమహోత్సవంలో భాగంగా అన్ని పంచాయతీల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల ఆవరణలలో కొబ్బరి, మామిడి మొక్కలు నాటితే పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. బాలక్రిష్ణాపురం సచివాలయ ఆవరణలో ఈవోపీఆర్డీ రమేష్ మొక్కలు నాటారు. ఏపీవో మార్గరెట్, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

గుడిపాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఇన్‌చార్జి ఎంపీడీవో ఉపేంద్ర అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ సచివాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యదర్శి దేవరాజులు, డిజిటల్ అసిస్టెంట్ రూప, సంపత్ పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

నగరి, సెప్టెంబరు 18: పాఠశాలలు అన్ని అంశాల్లో సంసిద్ధంగా ఉండాలని ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయ పేర్కొన్నారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త పేట ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. విద్యాప్రదేశ్ 90 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు జరిగిన విధానంపై చర్చించి, ఇకపై జరగాల్సిన కార్యక్రమాలను ఎలా విజయవంతం చేయాలో సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ సుమన్‌ను సన్మానిస్తున్న వెంకటాచలం

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 18: పుల్లూరు గ్రామానికి చెందిన మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటాచలం, వాటర్ షెడ్ కమిటీ మాజీ చైర్మన్, రైతు నాయకుడు గుణశేఖర్ నాయుడు బుధవారం ఎస్ఐ సుమన్‌ను శాలువతో సన్మానించి సత్కరించారు. పుల్లూరు గ్రామ టీడీపీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు వినతి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: ప్రభుత్వం కార్మికుల తొలగింపులో భాగంగా తీసుకొచ్చిన టెండర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ నేతలు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1225 మంది రెగ్యులర్ ఉద్యోగులుగా పంచాయతీ కార్మికులను కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటి వరకు దాన్ని అమలు చేయలేదని ఆరోపించారు. పంచాయతీ కార్మికుల సమస్యలను డీపీవో పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం కార్యదర్శి గోవిందప్ప, తిరుపతి జిల్లా కార్యదర్శి రాము, ఇతర నేతలు పాల్గొన్నారు.

అంగన్వాడీలో పౌష్టికాహార మాసోత్సవం

నింద్ర, సెప్టెంబర్ 18: మండలంలోని అరూరు అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహార వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరి సీడీపీవో అధికారిణి కృష్ణవేణి తల్లీబిడ్డలకు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఎంఈవో వసుమతిదేవి, సూపర్‌వైజర్ శ్యామల, అంగన్వాడీ కార్యకర్తలు, కాంతమ్మ, జయంతి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

గుడిపాల, సెప్టెంబరు 18: విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగివుండాలని సీఎంసీ ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేశులు, ప్రధానోపాధ్యాయులు ఖాతుంబీ అన్నారు. మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఐవీ, టీబీలపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు మేనేజర్ సద్దాం, ఏఎన్ఎంలు లక్ష్మి, కల్పన, జానకి పాల్గొన్నారు.